● చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం


కలికిరిలో విద్యుత్ దీపాలంకరణ పందిరిలో వినాయకుడు


కలకడలో చవితి ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

విఘ్నాలను తొలగించి మము కాపాడ రావయ్యా అంటూ భక్తులు ఆదిదేవున్ని పూజించడానికి సిద్ధమవుతున్నారు. బుధవారం వినాయకచవితి పండుగ సందర్భంగా పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇప్పటికే వివిధ రకాల డిజైన్లతో భారీ మండపాలను సుందరంగా అలంకరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చవితి పూజా సామాగ్రి కొనుగోలు చేసే భక్తులతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్


మదనపల్లెలో పూజా సామగ్రి కోనుగోలు


పీలేరులో మార్కెట్ సందడి

భక్తి భావనకు మట్టి వినాయకులే శ్రేష్టం


మట్టి వినాయక ప్రతిమల విజేతలకు బహుమతులు

కురబలకోట: పూజా పరమార్థానికి, భక్తిభావనకు మట్టి వినాయక ప్రతిమలే శ్రేష్టమని అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ సోషల్ రెస్పాన్స్‌బులిటీ క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. వీరి ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీలో మట్టి వినాయక ప్రతిమల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటాపోటీగా మట్టి వినాయక ప్రతిమలు తయారు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చాన్స్‌లర్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్‌చౌదరి మాట్లాడుతూ వినాయక చవితిని దేశ విదేశాల్లో ఘనంగా నిర్వహిస్తారన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారయ్యే ప్రతిమలతో పర్యావరణానిక హాని కలుగుతుందన్నారు. దీని వల్ల ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించడం శ్రేష్టమన్నారు. పంచ భూతాల స్ఫూర్తి దాగి ఉంటుందన్నారు. అంతేగాకుండా పండగలు ప్రకృతికి భారం కాకూడదన్నారు. మట్టి బొమ్మల విజేతలకు సోషల్ రెస్పాన్స్‌బులిటీ క్లబ్ వారు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

ప్రజల జీవితాల్లో వెలుగు నిండాలి


ద్వారకనాథరెడ్డి


నిసార్ అహ్మద్

బి.కొత్తకోట/మదనపల్లె: తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగి వెలుగులు నిండాలని వినాయకుడ్ని ప్రార్థిస్తున్నట్టు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఆయన నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ భక్తిశ్రద్దలతో వేడుక జరుపుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడిని భక్తితో పూజిస్తే తలపెట్టిన ఏకార్యమైనా విజయం సిద్ధిస్తుందన్నారు. వినాయక చవితిని ప్రజలు కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతారణంలో జరుపుకోవాలని కోరారు.

వందశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యం

పీలేరు : వందశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. మంగళవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో వయోజనవిద్యపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య సూపర్‌వైజర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో ఎంపిక చేసిన టీచర్లు సైనికుల వలే పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మావతమ్మ, ఏపీవో అశోక్‌రెడ్డి, ఏపీఎం జవహర్‌బాషా పాల్గొన్నారు.

సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలి

పీలేరు : ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలని రాయచోటి ఆర్డీవో ఎ. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలో ఓ ప్రభుత్వ చౌకదుకాణంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ నిత్యావసర సరుకులు అందాలని సూచించారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న ఆర్‌వోబీ నిర్మాణ పనులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ శివకుమార్, అధికారులు పాల్గొన్నారు.

యూరియా అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు

పీలేరు : యూరియా అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బాబు మోసెస్ అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలో పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా కొరత దృష్టిలో పెట్టుకుని యూరియా అక్రమంగా నిల్వ ఉంచిన, ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు అమ్మినా డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియాకు సంబంధించి అమ్మిన రికార్డులు పరిశీలించి, గోడాములు తనిఖీ చేశారు.

ఎయిడ్స్ క్విజ్ పోటీలో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

మదనపల్లె: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ విజయవాడలో మంగళవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో మదనపల్లె కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పి.నూలా అంజుమ్, పి.ప్రభుకుమార్‌లు ప్రథమ బహుమతికి ఎంపికై రూ.10వేల నగదు, ప్రశంసాప్రతం అందుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వ్యాధులపై ఖైదీలకు అవగాహన

మదనపల్లె: ఎయిడ్స్ నియంత్రం మండలి, ఆర్ ఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సబ్‌జైలు ఖైదీలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జైలర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో వ్యవహరించాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె రూరల్ : వినాయక చవితి పండుగ వేడుకను ఎక్కడ ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి తెలిపారు. మంగళవారం మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్నిశాఖల అధికారులతో సబ్ కలెక్టరేట్ సమావేశమందిరంలో వినాయకచవితి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి మాట్లాడుతూ..వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసే విగ్రహాలకు తప్పనిసరిగా అనుమతులు పొంది ఉండాలన్నారు. ప్రజా జీవనానికి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. రాత్రి వేళల్లో డీజే సౌండ్స్, ఇతరులకు ఇబ్బంది కలిగించడం చేయవద్దన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ మహేంద్ర, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): రాజకీయ కక్షతోనే రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. జరగని లిక్కర్ కేసులో అక్రమంగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంటున్న ఎంపీ మిథున్ రెడ్డిని మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టుకు తీసుకువచ్చిన సందర్భంగా అక్కడ ఎంపీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మిథున్ రెడ్డిపై అక్రమ కేసుపెట్టి కూటమి ప్రభుత్వం వ్యక్తిగత కక్ష తీర్చుకుంటోందన్నారు. మిథున్ రెడ్డి అక్రమ కేసు నుంచి బయటపడాలని, బెయిన్ మంజూరవ్వాలని 40 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు ఆలయాలు, మసీదులు, చర్చిలలో ప్రార్థనలు, పూజలు చేస్తున్నారన్నారు. ప్రజల దీవెనలు, దైవం ఆశీస్సులతో ఎంపీ ఈ అక్రమ కేసు నుంచి బయటపడతారన్నారు. పీలేరు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే చింతల వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కార్యదర్శి రాహుల్‌చక్రవర్తి రెడ్డి, పీలేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు జ్ఞానశేఖర్‌రెడ్డి, రమేష్ రెడ్డి, నారే వెంకట్రమాణారెడ్డి, కంభం భాస్కర్ రెడ్డి, తాళ్ళపల్లి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు


ఎరువుల దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

గుర్రంకొండ: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన గుర్రంకొండలోని పలు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎరువుల గోడౌన్లను తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్లు, పంపిణీ రిజిష్టర్లులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువులన కొనుగోలు చేసే ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ధరల సమాచార బోర్డుల్లో ప్రతిరోజు ఎరువుల ధరలు, స్టాకు వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు.

యూరియాను సద్వినియోగం చేసుకోవాలి

రైతులు యూరియాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అన్నారు. మంగళవారం మండలంలోని తరిగొండ రైతు సేవాకేంద్రంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేరకు యూరియాను సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయంలో తగిన మోతాలోనే యూరియాను వినియోగించుకోవాలన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకు ఉద్యమం

మదనపల్లె రూరల్ : దేశంలోని మెజారిటీ ప్రజలు లబ్ధి పొందుతున్న రిజర్వేషన్లు, ప్రైవేట్ రంగంలోనూ అమలుకోసం ఉద్యమం బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం.శివప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వీసీకే, బాస్ ముఖ్యప్రతినిధుల సమావేశం నిర్వహించారు. పీటీయం.శివప్రసాద్ మాట్లాడుతూ...2012లో ఎస్.ఆర్.మీనన్ కమిషన్ ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్ల అమలుకు సిఫారసు చేసి, డ్రాఫ్టబిల్లు కూడా రూపొందించడం జరిగిందన్నారు. దీన్ని వెంటనే పార్లమెంటులో ఆమోదించి, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈనెల 31న ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించి కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. అన్నమయ్య, చిత్తూరుజిల్లాలోని వీసీకే, బాస్ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల నాయకులందరూ హాజరుకావాలని శివప్రసాద్ కోరారు. సమావేశంలో వీసీకే, బాస్ నాయకులు ముత్యాలమోహన్, నీరుగట్టిరమణ, చాట్ల బయన్న, పెద్దపాలెం రవిశంకర్, తెట్టుశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదల్లో ఆత్మస్థైర్యం ప్రదర్శించాలి


సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో ఆయుధాల ప్రదర్శన

కలికిరి: మహిళలు ఆపద సమయాల్లో ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని సీఆర్‌పీఎఫ్(సీఐఏటీ–3) కమాండెంట్ రాజేష్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో కలికిరి మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ కేంద్రం పరిసరాలను విద్యార్థినులకు చూపించారు. అక్కడ జరుగుతున్న వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలను సీఆర్‌పీఎఫ్ అధికారులు వారికి వివరించారు. ఆయుధాల ప్రదర్శన ఏర్పాటు చేసి వాటిని ఎలాంటి పరిస్థితులలో ఉపయోగిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సెకెండ్ ఇన్ కమాండెంట్ కేబీకేఎస్ చౌదరి, జేఎన్టీయూ ప్రొఫెసర్ ఆనందప్రసాద్, మహిళ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గులాబ్‌జాన్, సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్‌లు పాల్గొన్నారు.

స్టోర్ డీలర్ల సంఘం నేతగా జంగా రాఘవరెడ్డి

కురబలకోట: స్టోర్ (చౌకదుకాణ) డీలర్ల కురబలకోట మండల అధ్యక్షుడిగా జంగావారిపల్లెకు చెందిన జంగా రాఘవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎస్. తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం. రెడ్డెప్ప, సహాయ కార్యదర్శిగా కనసానివారిపల్లె గణేష్‌కుమార్, కోశాధికారిగా యుగంధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ డీలర్ల సంక్షేమంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటుపడతానన్నారు.

మెనూ ప్రకారం భోజనం

కలకడ : జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా తనిఖీ అధికారి ధయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీకేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ప్రభుత్వం పంపిణీ మేరకు చిక్కీలు, కోడిగుడ్లు ఉన్నాయా, రికార్డుల మేరకు నిల్వ తనిఖీ చేశారు. రోజువారి కోడి గుడ్డు, చిక్కీలు అందుతన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందించే ఆహారం రుచికరంగా ఉండాలని సూచించారు. ఎంఈఓ మునీంద్ర నాయక్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, రమేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.